
క్లుప్తంగా

ఘనంగా అక్షయతృతీయ వేడుకలు




ఆంజనేయస్వామి, సీతారామలక్ష్మణులు

ఆదోని అర్బన్ : అక్షయతృతీయ సందర్భంగా ఆయా వైష్ణవ, శైవ, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. రణమండలకొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామి వారికి కార్తీక మాస నిత్యప్రసాద సేవాసమితి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, గంధలేపన అలంకారం, తులసీ, వివిధ రకాల పూల అలంకరణ, నైవేద్యంతో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు సభ్యులు అన్నదానం చేశారు.

– మంగరాయ సన్నిధిలో.....

పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి ఆలయంలో అక్షయతృతీయ వేడుకలు ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజారులు గురురాజ ఆచా రి, అక్షయకుమార్ మంగరాయ ఆంజనేయస్వామి, సీతారామలక్ష్మణులు, రాఘవేంద్ర మూలవిరాట్‌కు, ప్రహ్లాద విగ్రహానికి గంధలేపనంతో ప్రత్యేక అలంకరణ చేశారు. అదేవిధంగా డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవ నిర్వహించారు.

ఉత్తమ స్పెషల్ ఆఫీసర్ అవార్డుకు గీతావాణి ఎంపిక




స్పెషల్ ఆఫీసర్ గీతావాణి, కార్యదర్శి చంద్రశేఖర్

ఆదోని రూరల్ : మండలంలోని మండిగిరి గ్రామ పంచాయతీ తరపున రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు స్పెషల్ ఆఫీసర్ గీతావాణి, ఇదే పంచాయతీ తరపున ఉత్తమ అవార్డుకు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఎంపికయ్యారు. ఈనెల 24వ తేదీన విజయవాడ కమిషనర్ చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. ఈ మేరకు వారికి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

కొల్మాన్‌పేటలో క్రికెట్ టోర్నమెంట్



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: మండల పరిధిలోని కొల్మాన్‌పేట గ్రామంలో ఆదివారం సమ్మర్ స్పెషల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు గులిగేని హనుమంతు, వలకలదిన్నె రమేష్ ప్రారంభించారు. వేసవి సెలవుల నేపథ్యంలో టోర్నమెంట్‌ను ప్రారంభించినట్లు వారు తెలిపారు. గ్రామ క్రీడకారులకు ఉప్పల పాటి అర్జున్, వలకలదిన్నె క్రిష్ణ క్రీడాదుస్తులు పంపిణీ చేశారు.

ప్రైవేట్ పాఠశాల గుర్తింపు అనుమతుల పెంపుపై హర్షం

పెద్దకడబూరు : ప్రైవేట్ పాఠశాల గుర్తింపు అనుమతులను మూడు సంవత్సరాల నుంచి 8సంవతసరాలకు పెంచినందుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్(ఆపుస్మ) సభ్యులు, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం విశ్వనాథ్‌రెడ్డి, శేఖర్, గోవిందరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వారు స్థానిక బాలవికాష్ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాల అనుమతులను 8సంవత్సరాలకు పెంచడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి తాము పాఠశాలలను నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు గత రెండు రోజుల క్రితం (శనివారం రోజున) జీఓ నెంబర్ 38ని విడుదల చేయడానికి కృషికి టీచర్స్ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

తీరని తాగునీటి సమస్య!

ఆదోని అర్బన్ : పట్టణంలోని విక్టోరియాపేటలో ఏడు రోజులైనా మున్సిపల్ అధికారులు నీటిని సరఫరా చేయకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు ఫోన్ ద్వారా, నేరుగా సంబంధిత అధికారి, వాటర్ లైన్‌మెన్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఏడు రోజులైనా తాగడానికి నీరు లేకపోతే ఎక్కడి నుంచి తీసుకురావాలని వాపోతున్నారు. పక్క వీధిలో గంటల తరబడి నీటిని సరఫరా చేస్తున్నారని, ఈ వీధికి మాత్రం ఏడు రోజులైనా నీరు వదలడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డికి ఫోన్ చేయగా, మున్సిపల్ ఎంఈకు కాల్ చేయాలని చెప్పారు. అయితే మున్సిపల్ ఎంఈకి కాల్ చేయగా అందుబాటులోకి రాలేదు.

టైరు చూసుకో..ప్రాణం నిలుపుకో!

ఏడాది క్రితం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కర్నూలు మాజీ ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. హైదరాబాద్ నుంచి కర్నూలుకు వస్తుండటంతో జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ఇటిక్యాలపాడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఒక్కసారిగా కారు రెండు వైపులా టైర్లు పేలడంతో వాహనం సమీపంలోని పొలాల్లోకి దూసుకెళ్లడంతో రాజవర్ధన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆలూరు మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈనెల 16వ తేదీ హైదరాబాద్ నుంచి కర్నూలుకు కారులో వస్తుండగా జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద టైరు పగిలిపోవడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన ఆమె కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఈ రెండు ఘటనలే కాదు వేసవి వచ్చిందంటే చాలు వాహనాల టైర్లు పేలడం, మంటలు చెలరేగి వాహనాలు దగ్ధమవడం ఇంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. వేసవి సెలవులను ఎంజాయ్ చేయడానికో.. శుభకార్యాలకో కుటుంబ సభ్యులతో దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే వారు వాహనాల కండీషన్, చక్రాల నాణ్యతపై కాస్త జాగ్రత్త పాటించాలి. లేకపోతే సంతోషాల సంగమంతో ప్రారంభమైన ప్రయాణాలు విషాదంగా ముగిసే ప్రమాదముంది.

– కర్నూలు కల్చరల్

వాహనదారులు క్రమం తప్పకుండా తమ వాహనాలను మెకానిక్ వద్దకు తీసుకెళ్లి చెక్ చేయించుకోవాలి. వాహనం నిర్వహణతో పాటు టైర్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. ఎండా కాలంలో అయితే దూరప్రయాణాల సమయంలో మరింత జాగరూకతతో ఉండాలి. ఇటీవల టైర్లు పేలి వాహనాల ప్రమాదాల్లో ప్రముఖులు మృతిచెందిన విషయం విధితమే. ఈనేపథ్యంలో టైర్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' పాఠకుల కోసం..

- క్వాలిటీ టైర్లనే వాడాలి. కాలపరిమితి ముగిసిన టైర్లను ఎట్టి పరిస్థితుల్లో వాడరాదు. ప్రెషర్ సమపాళ్లలో ఉండేలా చూసుకోవాలి. టైర్ బటన్ సమాంతరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- కంపెనీలను బట్టి 30 వేల నుంచి 60 వేల కి.మీ. వరకు టైర్లు పనిచేస్తాయి. ఆ తర్వాత కచ్చితంగా మార్చుకోవాలి.
- వాహనాలను నెలల తరబడి వాడకుండా ఉంచరాదు. అలా ఉంచితే చక్రాలు గట్టి పడి ఉంటాయి. అలాంటి వాటిని బయటకు తీసుకెళ్తే ఒత్తిడి పెరిగి పగిలే ప్రమాదం ఉంది.

- వాహనాల టైర్లపై దృష్టి సారించాలి
- నిర్వహణ సరిగా లేకుంటే ప్రమాదాలకు అవకాశం
- నాణ్యమైన టైర్లనే వినియోగించాలి
- వేసవిలో మరింత అప్రమత్తత అవసరం

- బ్రేకులు, బ్రేక్ షూ సరిగ్గా పని చేయకపోయినా టైర్లతో పాటు వాటి చుట్టూ ఏర్పాటు చేసిన డిస్కలు వేడికి పగిలే ప్రమాదముంది. వాటిని కూడా తరచూ సరిచూసుకోవాలి.
- దూర ప్రయాణమైతే మధ్యలో అప్పుడప్పుడు వాహనం నిలిపి చక్రాలపై చేయి వేసి చూడాలి. గోరు వెచ్చని సెగ వస్తే బ్రేక్ పట్టేస్తోందని సంకేతం. వెంటనే మెకానిక్‌కు చూపించాలి.
- సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదు.
- మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతుంటారు. సర్వీసు రోడ్లు కలిసిన చోట, ప్రధాన కూడళ్ల వద్ద, స్పీడ్ బ్రేకర్లపై వేగంగా వెళ్లరాదు.



పగుళ్లిచ్చిన టైర్

- నైట్రోజన్ ఎయిర్ వాడటం ఉత్తమం. నైట్రోజన్ ఎయిర్ త్వరగా టైర్ హీట్ అవ్వదు. ఆక్సిజన్ టైర్ కంటే నైట్రోజన్ టైర్స్ లైట్ వెయిట్‌గా ఉంటాయి.
- నైట్రోజన్ గాలిని నింపే పంపులు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా గాలికి రూ.5 నుంచి రూ.10 తీసుకుంటారు. నైట్రోజన్ గాలికి రూ.25 నుంచి రూ.150 వరకు తీసుకుంటారు.
- వర్షకాలం, ఎండాకాలంలో గాలి తగ్గుతుంది. గమనించి ఎప్పటికప్పుడు సరిపడా గాలి నింపాలి.
- చక్రాల్లో గాలి కీలకం. 10 –15 రోజులకు ఒకసారి పరిశీలించుకోవాలి. ఆయా వాహన సామర్థ్యాన్ని బట్టి గాలి పట్టించాల్సి ఉంటుంది. ముందు టైర్లలో 30 శాతం, వెనక చక్రాలకు 35–40 శాతం గాలి ఉండాలి.
- వాహనం ప్రయాణించేటప్పుడు వేడెక్కి ఉంటుంది. కాస్త చల్లబడిన తర్వాత గాలి నింపాలి.
- వాహనం నడిపేటప్పుడు ఏమాత్రం అసౌకర్యంగా అనిపించినా వెంటనే మెకానిక్‌ను సంప్రదించాలి.

చక్రాల కాలపరిమితి నాలుగేళ్లు



ఇండియన్ టైర్ టెక్నికల్ అడ్వైజర్ కమిటీ ఆటోమోటివ్ టైర్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ప్రకారం టైర్ల కాలపరిమితి 4 ఏళ్లు. ఆ తర్వాత కచ్చితంగా మార్చుకోవాలి. వీటిని కూడా ప్రతి నాలుగు నెలలకు ఒకసారి లేదా 5,000 కిలోమీటర్లకు ఒకసారి టైర్ రొటేషన్, అలైన్‌మెంట్ బ్యాలెన్సింగ్ చేయాలి. టైర్ సర్వీస్ సెంటర్ ఆథరైజ్డ్ వారి వద్దకు తరచూ వెళ్లడంతో కస్టమర్లకు సరైన సూచనలతో పాటు సమాచారం ఇస్తారు. టైర్ బటన్ సాధారణంగా 8 ఎమ్ఎమ్ –12 ఎమ్ఎమ్ వరకు ఉంటుంది. ఎప్పుడైతే బటన్ 1 ఎమ్ఎమ్ – 2 ఎమ్ఎమ్‌కు వస్తుందో అప్పుడు కూడా టైర్లను మార్చుకోవాలి. టైర్స్‌లో వాడే మిశ్రమం సిలికా ఎంత ఎక్కువ ఉంటే టైర్స్ అంత లైఫ్ వస్తుంది. సిలికా శాతం ఎక్కువ ఉన్న టైర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి.

– దేశాయ్ చిన్నారెడ్డి,
ఆటో సర్వీస్ టెక్నికల్ ఇంజినీర్

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు

హొళగుంద: రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన దేవరగట్టులో ఆదివారం స్వామివారం పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయంలో పూజారులు మూలవిరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాబిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహా మంగళారతి, ఆకుపూజ, నివేదన, నిరాజన మొదలైన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదం అందజేయగా ఆలయ నిర్వాహకులు, కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. మండల పరిధిలోని కే.పేట గ్రామంలో బోయ నల్లబోతుల రాజ్‌కుమార్ ఇంటి వద్ద గుట్టుగా కర్ణాటక మద్యం అమ్ముతున్నాడు. సమాచారం అందడంతో ఎస్‌ఐ మహేష్‌కుమార్ పోలీసు సిబ్బందితో ఆదివారం తనిఖీ చేయించారు. నిందితుడి నుంచి 96 జాన్స్ ఒరిజినల్ ఛాయిస్ డీలెక్స్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పత్తికొండ రూరల్: పత్తికొండ బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి నిలిపిఉంచిన లారీని బైక్‌పై వచ్చిన యువకులు గమనించకుండా వెనకవైపు ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కోడుమూరు మండల పరిధిలోని వల్కూరు గ్రామానికి చెందిన భాస్కర్ పెరవలిలోని బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యంలో కృష్ణగిరికి చెందిన రంగడు లిఫ్టు అడగ్గా బైక్‌పై ఎక్కించుకున్నారు. రమ్య రిసార్ట్ సమీపంలో రిపేరీలో ఉన్న లారీని ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకుండా రోడ్డుపై నిలిపి ఉంచడంతో గుర్తించకుండా వెనకవైపు ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు.

ఘనంగా బసవ జయంతి



ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, గ్రామపెద్దలు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రం మంత్రాలయంలో బసవ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. బసవేశ్వరుడి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై ఉంచి మహిళలు కళాశాలతో, డప్పు, డ్రమ్స్ మోతల మధ్య పాతవూరులోని శివాలయం వద్ద నుంచి రాఘవేంద్ర సర్కిల్, ఎంటీఆర్ సర్కిల్ మీదుగా ఉరేగింపు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత వై ప్రదీప్‌రెడ్డి ఉరేగింపులో పాల్గొన్నారు. అనంతరం శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈయనకు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరహాల్‌లో సాముహిక వివాహాలు

కౌతాళం: మండలంలో బసవ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నదిచాగి గ్రామంలో ఈ వేడుకల సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విశ్వగురు జగజ్యోతి బసవేశ్వరుడి చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించి బసవేశ్వర సర్కిల్ ఉన్న బసవేశ్వర విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఉప్పరహాల్‌లో బసవ జయంతి సందర్భంగా గ్రామంలోని కనకప్ప తాత మఠంలో ఐదు జంటలు సాముహిక వివాహాలతో ఒక్కటయ్యారు. కనకప్పతాత మఠం మఠాధిపతి చంద్రశేఖర్ తాత ఆధ్వర్యంలో ఈ వివాహాలు వైభవంగా జరిగాయి. ఈ పండుగను పురస్కరించుకుని 38సంవత్సరాలుగా మఠం ఆధ్వర్యంలో ఉచితంగా సాముహిక వివాహాలు కొనసాగుతున్నాయి.

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో ఆదివారం వీర శైవలింగాయతీల ఆరాధ్య దైవం శ్రీ బసవేశ్వర స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శంకరలింగేశ్వర స్వామి ఆలయంలో వీరశైవ లింగాయతీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున నుంచి స్వామి వారికి జలాబిషేకం, పంచామృతాబిషేకం, రుద్రాబిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజ, మహామంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయంనుంచి స్వామివారి చిత్ర పటాన్ని పుర వీధులు గుండా నిర్వహించారు. ఊరేగింపు మధ్యలో నందీశ్వర వేషాధారణతో భక్తులు కత్తిలతో విన్యాసం చేసి భక్తులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు బెట్టన గౌడ, చిప్పిగ ఈరప్ప, మహంతేష్ స్వామి, బుక్కిటి వీరేష్, ఎస్.పి. రాజమౌళి, జగదీష్ స్వామి, మూర్తి గౌడ, మల్లికార్జున గౌడ, భీంరెడ్డి, పాల్గొన్నారు.

బసవేశ్వర జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే

ఆదోని రూరల్ : మండలంలోని పెసలబండ గ్రామంలో ఆదివారం జరిగిన బసవేశ్వర జయంతి సందర్భంగా శ్రీకృష్ణ విగ్రహ, ధ్వజస్తంభం, కలస్థాపన మహోత్సవ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాతూ గ్రామంలో శ్రీకృష్ణ విగ్రహ, ధ్వజస్తంభం, కలస్థాపన చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరూ ఐక్యమత్యంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.



ఉరేగింపులో పాల్గొన్న ప్రదీప్‌రెడ్డి



నదిచాగిలో బసవ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు



కత్తితో బియ్యం బిందెను ఎత్తి విన్యాసం చేస్తున్న భక్తుడు



ఉప్పరహాల్‌లో సాముహిక వివాహాల దృశ్యం

ఎస్టీ రిజర్వేషన్ సాధనే ధ్యేయం

ఎమ్మిగనూరుటౌన్: వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ సాధించడమే వీఆర్‌పీఎస్ లక్ష్యమని, ఈ మేరకు ఈనెల 31న ఢిల్లీలో వాల్మీకుల సంకల్ప దీక్ష పేరుతో పోరాటం చేయనున్నట్లు వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దూరు సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ కళాశాల ఆవరణలో సంకల్ప దీక్ష కరపత్రాలను ఆవిష్కరించి అనంతరం వాల్మీకి సంఘ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయంపై పార్లమెంట్‌లో ఆమోదం లభించే వరకు ఢిల్లీలో తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. వాల్మీకులు పార్టీలకతీతంగా పోరాటానికి కదలిరావాలని పిలుపునిచ్చారు. వీఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌భీంనాయుడు, ఉపాధ్యక్షుడు మునెప్ప, నాయకులు కాశీంనాయుడు, మురళినాయుడు, లక్ష్మన్న, మద్దిలేటి, మహేంద్రబాబు, వెంకటేష్, రఘు, జయన్న, పెద్దయ్య, రామకృష్ణ, జయరాం,కేశన్న, నాగేష్, గిడ్డయ్య పాల్గొన్నారు.



సంకల్ప దీక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీఆర్‌పీఎస్ నాయకులు

వేధింపుల కేసు నమోదు

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మరో యువతిని మూడేళ్ల గా పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడు. అయితే గతే డాది నుంచి ఫోన్ ద్వారా వేధిస్తున్నాడని మాధవ రం పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ధ్యాన కేంద్ర బృందం

కోసిగి: శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఆదోని, ఎమ్మిగనూరు పిరమిడ్ ధ్యాన కేంద్ర అధ్యక్షుడు పాండురంగ శెట్టి, వీరన్న శెట్టి పేర్కొన్నారు. ఆదివారం కోసిగిలో పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో శాకాహారంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస అని, మానసిన ప్రశాంతత కలుగుతోందన్నారు. మానసిక ఒత్తిడికి గురై అనేక వ్యాధుల బారీ పడుతుంటామని, అధిగమించేందుకు ధ్యానం చేయడం మంచి మార్గమన్నారు. అలాగే మంసాహారం తినడం ఆరోగ్యానికి హాని కరమని, శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన కేంద్ర సభ్యులు రాఘవరెడ్డి, బన్నూరు నారాయణ, కంపాడు వీరన్న, వెంకటరమణ, మధుసూధన్ గుప్తా, ఎర్రిస్వామి, తిక్కయ్య, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం



సోమయ్యను గుర్తించిన మంత్రాలయం పోలీసులు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు మంత్రాలయం వచ్చిన గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన సోమయ్య అనే వ్యక్తి గత నాలు గు రోజుల క్రితం అదృశ్యమైన విషయం తెలిసిందే. అయితే కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేసిన పోలీసులు ఆదివారం ఆదోని సమీపంలోని బైచిగేరి క్రాస్ వద్ద సోమయ్యను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సోమయ్యను వెతకడంలో కానిస్టేబుల్ రంగస్వామి కృషిని సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు అభినందించారు.

కమనీయం...వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఇందిరానగర్‌లోని ఉప్పరవీధిలో వెలిసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భూదేవిశ్రీదేవి వెంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా వేంకటేశ్వరస్వామివారి కల్యాణాన్ని వేదపండితులు బ్రహ్మమూర్తంలో భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి భక్తబృందం తిరుమల నుంచి తెప్పించిన గజమాలను అందజేశారు. మధ్యాహ్నా భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం పురవీధులగుండా పల్లకోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు రాముడు, సభ్యులు శాంతమూర్తి, రాజశేఖర్, శ్రీనివాసులు, విజయ్, భక్తబృందం పెండేకల్ శివ, బుశెట్టిసురేష్, నాగరాజు, మనోహర్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు తాళిబొట్టును చూపుతున్న పూజారులు

డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సాముహిక వివాహాలు



నూతన వధూవరులతో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్ : విశ్వజ్ఞాని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, విశ్వగురు బసవేశ్వరస్వామి జయంతి సందర్భంగా ఆదివారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సాముహిక వివాహాలను ఘనంగా నిర్వహించారు. డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి టి.వీరేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ డిప్యూటీ కమిషనర్ కస్టమ్స్ అండ్ జీఎస్టీ కె.నాగరాజు, జాతీయ మానవహక్కుల కార్యదర్శి, వైఎం.మోహన్‌రాజ్, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.మహేష్ హాజరయ్యారు. ముందుగా ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కె.నాగరాజు బృందం విప్లవ గేయాలను ఆలపించారు. ఈ వివాహాల కార్యక్రమాన్ని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్ల నేడు అన్నివర్గాల వారు సమానహక్కులు పొందుతున్నారన్నారు. దళితులు ఉన్నత చదువులు చదువుకొని అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. హిందూ, క్రిస్టియన్ సంప్రదాయాల ప్రకారం వివాహాలు జరిగాయన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి సహకరించిన దళిత నాయకులందరికీ శాలవా పూలమాలతో పాటు షీల్డ్ అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా సమితి సభ్యులు ఎ.విజయ్, నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కుమార్ స్వామి, పట్టణ అధ్యక్షులు టి.వంశీ, ఉపాధ్యక్షులు ఎం.రమేష్, ఎ.మణి, నాయకులు ఎం.గిరిమల్లప్ప, ఎస్.నాగరాజు, ఆవుల సురేష్, ఎన్.కె.సోమశేఖర్, వైటీ దేవేంద, ఉదయ్, మోజేష్, టి.గోపీ, కె.సన్నీ, ఎ.పులిరాజు, ఆటో యూనియన్ నాయకులు చంద్రప్రేమ్, ఉలిగేష్ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను విడనాడాలి



మాట్లాడుతున్న హేతువాద సంఘం నాయకులు

ఆదోని అర్బన్ : మూఢనమ్మకాలను విడనాడాలని, అప్పుడే అభివృద్ధి సాధిస్తారని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నే వెంకటసుబ్బయ్య, హేతువాద సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.క్రిష్ణయ్య, సత్యనారాయణ, అర్‌సీసీ రాజు, అధ్యాపకులు డాక్టర్ జి.నల్లారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆదోని రాయలసీమ కో–ఆర్డినేషన్ కమిటీ భవనంలో ఆదివారం హేతువాద సంఘం సమావేశాన్ని విశ్రాంత తహసీల్దార్ షేక్షావలి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రజలు నూటికి 90 శాతం మంది ఇంకా మూఢనమ్మకాలపై ఆధారపడి జీవిస్తున్నారని, దానివలన ఎలాంటి మానవ పురోగతి ఉండదన్నారు. దయ్యాలు, భూతాలు లేవని, అవి మోసగాళ్ల కల్పితాలేనని డాక్టర్ వద్దకు వెళ్తే రోగం నయమవుతుందన్నారు. మూఢనమ్మకాలను ప్రజలు నమ్మరాదని, ప్రజల్లో మార్పు రావాలని, అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం సభాధ్యక్షులు షేక్షావలి, కార్యవర్గ సభ్యులు నల్లారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.